క్లుప్తంగా

వెంకన్న తిరునామాలకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలోని తిరునామాలకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. వెంకటేశ్వరస్వామి తిరునామాళ్లకు అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. ఉదయం నుండి భజనలు చేశారు.

ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపితే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసు కానిస్టేబుల్లు శరత్, సురేష్ తెలిపారు. వారు శనివారం ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా అడ్డదిడ్డంగా ఆటోలను నిలపడం వల్ల ప్రజలు, దుకాణదారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పద్ధతి మార్చుకోకపోతే కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు.

పరిశోధన అంశాలపై అవగాహన



హాజరైన అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీస్వామి విద్యాప్రకాశనంద పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం అన్‌లాక్ ఎక్సలెన్స్ ఏ రీసెర్చ్ పేపర్ రైటింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. గీతం యూనివర్సిటీ రిసోర్స్ పర్సన్ డాక్టర్ షణ్ముఖ శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకులకు పరిశోధన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ మురళి, అధ్యాపకులు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై రైతులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జీఎన్ కండ్రిగలోని రైతులకు శనివారం మండల వ్యవసాయాధికారిణి భారతి వరి పంటలో ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరిపంటలో ఎలుకల నివారణకు బ్రోమోడిలిన్ మందు 10 గ్రాములు ఎకరాకు వాడాలని తెలిపారు. ఎలుక ఎర తయారు చేసే విధానాన్ని వివరించారు. అనంతరం రైతులకు బ్రోమోడిలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు వద్దు

శ్రీకాళహస్తి: నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినుత తన ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూద‌న్‌రెడ్డిని విమర్శిస్తున్నారని ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి వినుతకు ఉందా అని తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఎమ్మెల్యేపై నోరు జారితే నియోజకవర్గంలో ఎక్కడా తిరగలేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నికల ప్రచారం చేసుకోవచ్చని అయితే ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. గత ఎన్నికల్లో జనసేనకు వచ్చినోట్లు కేవలం 3వేలే అని గుర్తుచేశారు. మూడు వేలకే అంతలా రెచ్చిపోతే 40వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే ఎంత రెచ్చిపోవాలో చెప్పాలన్నారు. ఇకనైనా వినుత రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలన్నారు.

బోర్డుల పంపిణీ



బోర్డులు అందజేస్తున్న ఎంఈవో రవి

సత్యవేడు: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ పథకాలు తెలిపే బోర్డులు శనివారం ఎంఈవో కె.రవి ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. జగనన్న గోరుముద్ద అమలుతీరు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ తీరు, లోటుపాట్లు, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ తదితరాలను తెలుపుతూ ముద్రించిన బోర్డులను అందజేశారు. వాటిని పాఠశాలల్లో ఏర్పాటుచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఉష, ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వర్లు, ఈబీ గురునాథం, ఓ త్యాగరాజులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



మాట్లాడుతున్న హేమకుమార్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు ఎస్టీ కాలనీలో యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు హేమకుమార్ మాట్లాడుతూ గిరిజనులు విషపురుగులు, అడవి జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్స వివరించారు. కాలనీవాసులకు దుప్పట్లు, పాదరక్షలు, ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు సాయికిరణ్, శ్రీనివాసులు, చంద్ర, సురేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

గోడలపై ఆకర్షణీయంగా బొమ్మలు, ఏర్పేడు ప్రాథమిక పాఠశాలలో ఆకట్టుకుంటున్న నూతన డెస్కులు, పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్







గవర్నమెంట్ కాన్వెంట్

- కార్పొరేట్‌ను తలదన్నేలా సరికొత్త హంగులు
- తొలివిడతలో 41 పాఠశాలలకు రూ.9.10 కోట్లు
- రెండో విడతలో 36 పాఠశాలలకు రూ.6.44 కోట్లు
- నాడు-నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలలు



రూపురేఖలు మారిన పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాల

ప్రభుత్వ బడి కాస్తా గవర్నమెంట్ కాన్వెంట్‌లా మారిపోయింది. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. కోట్లాది రూపాయలు కేటాయించింది. నాడు నేడు పథకంతో సర్కారు బడుల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ఊర్లో పాఠశాలలు అందంగా, ఆహ్లాదంగా మారాయి. అత్యాధునిక వసతులు సమకూరాయి. గతంలో పేదలందరూ ప్రైవేటు కాన్వెంట్‌కు వెళ్లడం గొప్పగా చెప్పుకునేవారు. ఇప్పుడు సర్కారు బడుల్లో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఏర్పేడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. గతంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలలు సైతం నూతన హంగులతో కొత్తశోభను సంతరించుకున్నాయి. మండలంలో 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 4,678 మంది విద్యార్థులు, 157 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో ప్రభుత్వం తొలి విడత కింద 41 పాఠశాలలు గుర్తించి అభివృద్ధి పనుల కోసం రూ.9.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో పనులన్నీ పూర్తికావడంతో సరికొత్త రూపురేఖలతో సుందరంగా దర్శనమిస్తున్నాయి. రెండో విడతలో 36 పాఠశాలల్లో రూ.6.44 కోట్లు మంజూరు చేసింది. ఈ పాఠశాలల్లో కూడా పనులు త్వరితగతిన జరుగుతున్నాయి.

మెరుగైన సౌకర్యాలు

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద ప్రభుత్వం పలు సౌకర్యాలను కల్పించింది. గ్రీన్ బోర్డులు, బాత్ రూమ్స్, డెస్కులు, టాయిలెట్స్, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు తదితర వసతులను కల్పించి కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా సౌకర్యాలు కల్పించారు. ఇలా పాఠశాలలు కొత్త హంగులతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సైతం ఆశ్చర్యపరచే విధంగా రూపురేఖలు మారిపోయాయి. మండలంలోని బండారుపల్లి, ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పాపానాయుడుపేట, అంజిమేడు, పల్లం, పంగూరు, కోబాక, కందాడు, గుడిమల్లం, దుర్గిపేరి, ముసలిపేడు, పెన్నగడం, పెనుమల్లం, ఏర్పేడు, వికృతమాల, ఇసుకతాగేలి, మాధవమాల, మన్నసముద్రం తదితర పాఠశాలల్లో తొలివిడత నాడు-నేడు కింద 41 పాఠశాలలు కొత్త హంగులతో రూపురేఖలు మారిపోయాయి. మిగిలిన 36 పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

సులభరీతిలో విద్యాబోధన

ప్రభుత్వ పాఠశాలల్లో సులభతరంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నూతన విద్యా బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బొమ్మల ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యను అందించడానికి, వారికి చదువుపట్ల ఆసక్తి పెంచేలా వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన చిత్రాలను పాఠశాలల గోడలపై చిత్రీకరించారు. అలాగే పలు పాఠశాలలకు ప్రహరీగోడలు నిర్మించారు. ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించారు.

రూపురేఖలు మారిన పాఠశాలలు



నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారాయి. ఇలా పాఠశాలలు మారతాయని అనుకోలేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆహ్లాదపరిచే విధంగా కొత్త రూపురేఖలు సంతరించుకోవడంతో చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవు. పేదలందరూ జగన్‌కు రుణపడి ఉండాలి.

–సునీల్, విద్యార్థిని తండ్రి, సీతారాంపేట, ఏర్పేడు మండలం

కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఉన్నాయి



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడుతో పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నాయి. వసతులతో పాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగ్, షూ, సాక్స్, బెల్టు, టై అందజేస్తోంది. వారంలో మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందిస్తోంది.

–బత్తెయ్య, కందాడు, ఏర్పేడు మండలం

నూతన హంగులతో పాఠశాలలు



నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు నూతన హంగులతో అలరారుతున్నాయి. తొలివిడతలో 41 పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. రెండో విడతలో 36 పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. త్వరలో అన్ని పాఠశాలలు నూతన హంగులతో సంతరించుకోనున్నాయి.

–ప్రేమలత, ఎంపీడీఓ, ఏర్పేడు మండలం

ప్రజల సమస్యలు తెలుసుకుంటూ..



శ్రీకాళహస్తి: ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పవిత్రారెడ్డి



రేణిగుంట : కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్ వద్ద ప్రజల్లో మమేకమవుతూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రాజీవ్‌నగర్‌ప్రాంతంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. అయితే కొత్తగా వచ్చిన ప్రతిపక్ష నాయకులు ప్రలోభపెడుతున్నారని ప్రజలు వాటిని నమ్మొద్దని సూచించారు. ఇన్నేళ్లుగా ప్రజాసమస్యలు పట్టించుకోని టీడీపీ, జనసేన ఎన్నికలు సమీపిస్తుండడంతో దొంగప్రేమ చూపుతున్నాయని చెప్పారు. రాజకీయ స్వలాభం కోసం కల్లిబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే టీడీపీ-జనసేనతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎంతో తెలివైనవారని, సాయం చేసిన వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో మరిచిపోరని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రభాకర్, పాండు, అలేశ, రాజారెడ్డి, పాండు, ఎల్లయ్య, రామమోహన్, సత్యబాబు, మునిరాజారెడ్డి, ధనంజయులు, రమేష్‌బాబు, జానీ, బాలాజీ, నాగరాజు, వెంకటేష్, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి భూమిపూజ

రేణిగుంట: పట్టణంలోని పాంచాలినగర్‌లో మురుగునీటి కాల్వల నిర్మాణానికి శనివారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి భూమిపూజ చేశారు. రూ.8లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులను ఆమె కొబ్బరికాయ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రేణిగుంటలో నాలుగేళ్లలో ప్రధాన వీధులన్నింటికీ సీసీ రోడ్లు నిర్మించామన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అర్హులందరికి నవరత్న పథకాలను అందించామన్నారు. ఇక్కడి ప్రజలపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఎంతో ప్రేమ ఉందని పేర్కొన్నారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, జువ్వల దయాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మంచి కోర్సులు ఎంపిక చేసుకోవాలి

ఏర్పేడు: విద్యార్థులు 10వ తరగతి అనంతరం మంచి కోర్సులను ఎంపిక చేసుకోవాలని యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కెరియర్ గైడెన్స్‌పై 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. అనంతరం కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రమేష్, గుణశేఖర్, గౌతమ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పాణ్యం ఎమ్మెల్యే



రాహుకేతు పూజల్లో ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపికను, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

నాగలాపురం: మండలంలోని కడివేడు, బీరకుప్పం, టి.పి.కోట సచివాలయాలను శనివారం ఎంపీడీవో పీఎంకె బాబు తనిఖీ చేశారు. ప్రతి రోజూ చేస్తున్న పనులను ఫొటోలతో సహా పంపించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఇంటి పన్నులు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఇంటి స్థలం రిజిస్ట్రేషన్లు, కుల గణనపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు, తిరుపతికి చెందిన సుమంత్(37), వేణు(21) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా అంజిమేడు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలకు సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్



మాట్లాడుతున్న డీఈవో డాక్టర్‌శేఖర్

శ్రీకాళహస్తి: ఉపాధ్యాయులు బోధనలో సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఈవో శేఖర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన సబ్ డివిజన్ స్థాయిలో ఫిజిక్స్ ఉపాధ్యాయులకు నిర్వహించిన సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్ వినియోగంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈడీవో మాట్లాడుతూ డిజిటల్ విద్యకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు బోధన సులభతరమైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో మధు, ఎంఈవో బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఆర్పీలు దేవేంద్ర, రవికుమార్, మోహన్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌వో సుడిగాలి పర్యటన



డీలర్లతో మాట్లాడుతున్న డీఎస్‌వో రాజారఘువీర్

కేవీబీపురం: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి(డీఎస్‌వో) రాజారఘువీర్ శనివారం కేవీబీపురంలో సుడిగాలి పర్యటన చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశమై ప్రజలకు అందిస్తున్న నిత్యావసర వస్తువుల సరఫరాపై ఆరా తీశారు. బియ్యం, చెక్కరతో పాటు కందిపప్పు, రాగులు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు.

రూ.72 వేల రికవరీకి ఆదేశం

మండలంలోని పెరిందేశం గ్రామానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ రాజీనామా చేయడంతో ఇన్‌చార్జ్‌గా నియమితులైన తలారి కృష్ణయ్య బియ్యం సరఫరా చేయకుండానే నాలుగు నెలలకు సుమారు రూ.72 వేలు వసూలు చేసినట్లు అందిన ఫిర్యాదుపై విచారించారు. ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఎస్‌డీటీ సుబ్బయ్య, డీటీ మునిరత్నం పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం



ప్రజలతో మాట్లాడుతున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: నిత్యం పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తొట్టంబేడు మండలం రౌతు సూరమాల పంచాయతీలో ఆమె పర్యటించారు. ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందిన వారితో మమేకమయ్యారు. నాలుగు సంవత్సరాలు ప్రజలకు కనిపించకుండా పోయిన వారందరూ ఎన్నికల సీజన్‌లో ముంగిట్లో వాలిపోతారని చెప్పారు. వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేందర్‌రెడ్డి, నాగరాజ, వెంకటయ్య, చంద్రయ్య రామయ్య, పాపయ్య, శంకర్, మునిరత్నం, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, భక్తవత్సలం, కోవి చంద్రయ్యనాయుడు, మణినాయుడు, రమణయ్యనాయుడు, ఢిల్లీబాబు, భాస్కర్, గెరటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత నాగలాపురం జట్టు



క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

నాగలాపురం: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో సత్యవేడులో శనివారం మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో సత్యవేడు, నాగలాపురం జట్లు తలబడ్డాయి. నాగలాపురం మహిళల జట్టు విజేతగా నిలిచినట్లు పంచాయతీ కార్యదర్శి హరి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు పరీక్షల కారణంగా పాల్గొనలేకపోయారు. విజేతలను సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, నాయకులు అభినందించారు.

నాన్నారం కథల పుస్తకావిష్కరణ



నాన్నారం కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, ఉపాధ్యాయులు

నారాయణవనం: నాన్నారం కథల పుస్తకం నారాయణవనం సంస్కృతిని ఉట్టిపడేలా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఆర్సీ కృష్ణస్వామి రాజు రచించిన నాన్నారం కథల పుస్తకాన్ని శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సులోచన అధ్యక్షతన ఆవిష్కరించారు. కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ తెలుగు, తమిళ సంస్కృతుల మిళితమైన నారాయణవనం వాసుల వ్యవహారిక (మాండలిక)భాషతో రాసిన కథలు అందరినీ ఆకట్టుకుంటాయన్నారు. తెలుగు ప్రాచీన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ కథల స్తుకాలు మంచి పౌరులను తీర్చిదిద్దుతాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలల పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ బాల సాహిత్యం వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ ఆచార్యులు యువశ్రీ, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత నాగరాజు, రచయిత వీఆర్ రాసాని తదితరులు నాన్నారం పుస్తకంలోని 30 కథలను సమీక్షించారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా హరహర తీర్థంలోని పురాతన శివాలయ పునర్నిర్మాణ పనులను శనివారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న శివాలయాన్ని పూర్తిగా తొలగించి పునర్నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులను వేగవంతం చేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లోపు కుంభాభిషేకం నిర్వహించాలని అధికారులకు సూచించారు. నూతన శివలింగం, నందీశ్వరుడు విగ్రహాలను వెంటనే తెప్పించి జలవాసం, దానవాసంలో పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి భక్తులు వచ్చే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో ట్రాఫిక్ జామ్



వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్ మలుపు వద్ద స్తంభించిన ట్రాఫిక్

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామిక వాడకు తరలివస్తున్న పరిశ్రమల తాకిడికి శ్రీకాళహస్తి-తడ మార్గంలో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోంది. దీంతో వరదయ్యపాళెంలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. ప్రధానంగా వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్ మలుపు వద్ద ప్రతి అరగంటకోసారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శ్రీసిటీలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి నిర్మాణ పనులకు మెటీరియల్ తరలింపు, ఇప్పటికే ఉత్పత్తులు ప్రారంభించిన పరిశ్రమల వాహనాలు పెద్ద సంఖ్యలో రోజువారీ ఈ మార్గం గుండా వెళ్తున్నాయి. ఇటీవల ప్రారంభమైన కల్కి ఒన్నెస్ ఆలయం సందర్శనకు రోజువారీ వందలాదిగా భక్తులు వస్తున్నారు. దీంతో ఈ మార్గంలో వరదయ్యపాళెం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రతి అర గంటకు ఓసారి ట్రాఫిక్ జామ్ జరుగుతూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నతమైన ఆశయంతో చదవాలి



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ ఉపాధ్యాయులు

ఏర్పేడు: విద్యార్థులు ఉన్నతమైన ఆశయంతో చదవాలని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ అన్నారు. మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎఫ్-3 పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన (3 నుంచి 10వ తరగతి) విద్యార్థులతో సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టించి చదివితే 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతను సాధించవచ్చన్నారు. సెల్‌ఫోన్‌లు, టీవీలను కొన్ని రోజులపాటు పక్కన పెట్టాలని చెప్పారు. ఉన్నత ఆశయంతో చదివితే టాపర్లుగా నిలవవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ద్వారకనాథ్‌రెడ్డి, కుమార్ రాజా, ఉమామహేశ్వర్, రాధాకుమారి, సురేష్‌బాబు, రామచంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయసేవలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): వృద్ధులకు అన్యాయం జరిగితే న్యాయస్థానం వారికి ఉచిత న్యాయసేవలు అందిస్తుందని శ్రీకాళహస్తి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ అన్నారు. తొట్టంబేడు మండలం శివనాథపురంలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వృద్ధుల హక్కులు అనుభవించడంలో ఎక్కడైనా ఆటంకం కలిగితే వారు కోర్టులను ఆశ్రయించవచ్చని సూచించారు. కోర్టు వారికి ఉచితంగా న్యాయసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్‌బాబు, రాజేశ్వరావు, అరుణ్, శ్రీరామ్, యాసిన్, అమ్మ ఆశ్రమ వ్యవస్థాపకులు భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీల సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

ఏర్పేడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలాజీ అన్నారు. మండలంలోని వికృతమాలలో శనివారం రాత్రి ఆయన బీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న బీసీలకు రాజకీయ పదవులలో సముచిత స్థానం కల్పిస్తున్నట్లు వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు పేర్కొన్నారు. మరింత అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీని రెండోసారి గెలిపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎల్లప్పరెడ్డి, గెరటారెడ్డి, దాముర్రెడ్డి, రత్నంరెడ్డి, మునిరెడ్డి, దామోదర రెడ్డి, హరి పాల్గొన్నారు.